భానుడి ప్రకోపానికి జనం ఉక్కిరిబిక్కిరి

- కొద్ది రోజులుగా 40 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు
- ఉదయం 9 గంటల నుంచి భగభగమంటున్న ఎండలు
- ముందస్తు జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు


అధికంగా ఉన్న ఎండ తీవ్రత

బుట్టాయగూడెం: భానుడు భగభగమండుతున్నాడు. పగటి పూటతో పాటు రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో ఉదయం నుంచే వడగాల్పులు వీయడం ప్రారంభమవుతున్నాయి. రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరగడంతో వేడి సెగలు కక్కుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మన్యం ప్రాంతంలోని చెట్లు పచ్చదనంతో ఉన్నాయి. చెట్ల గాలి కూడా వెచ్చగా వీయడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గత నాలుగు రోజులుగా గిరిజన ప్రాంతంలో ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగమంటూ తన ప్రతాపాన్ని చూపించడంతో ప్రజలు బయటకు రావడానికి భయపడిపోతున్నారు. వేడిగాలులకు అల్లాడి పోతున్నారు. మధ్యాహ్నం సమయానికి ప్రజలు ఇళ్లకే పరిమితం అవ్వడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. పగటి పూట తమ పనుల నిమిత్తం గ్రామాల్లో తిరిగే ప్రజలు, పొలం పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులు మండుతున్న ఎండలు చూసి భయాందోళనతో బయటకు రాలేకపోతున్నారు. ఉక్కపోతలతో వృద్ధులు, చిన్న పిల్లలు మరింత అల్లాడి పోతున్నారు. మార్చిలోనే ఇలా ఉంటే మే నెల రోహిణీకార్తిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు తీవ్ర భయందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువ ఉండే అవకాశం ఉందని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలు అవసరం

ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం 6 గంటలైనా తగ్గడం లేదు. అలాగే ఉక్కపోతలు, వడగాడ్పులతో ప్రజలు అల్లాడి పోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏజెన్సీలో గత రెండు రోజుల నుంచి43 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వచ్చే మే నెలలో ఎండల తీవ్రత మరింత తీవ్రంగా పెరిగే అవకాశం కనిపిస్తుంది. అలాగే రోహిణీ కార్తె కూడా జోడవ్వబోతుంది. దీనితో ప్రజలు ఎండల నుంచి రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావొద్దని వైద్యులు చెబుతున్నారు. ఆరు బయట పని చేసేవారు సూర్యరశ్మి నుంచి కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు. అలాగే తరచూ నీరు తాగడంతో పాటు నిమ్మరసం, కొబ్బరి నీళ్లు సేవిస్తూ ఉండాలి. అదే విధంగా తెలుపు, లేత రంగుల్లో ఉన్న పల్చని కాటన్ దుస్తులు ధరించాలన్నారు. తలకు ఎండ తగలకుండా టోపీలు, రుమాలు చుట్టుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

నూకాలమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తికి అభిషేకాలు, మూల విరాట్‌కు ఏకాదశ హారతి, వేద దర్బారు సేవ, చతుర్వేద స్వస్తి తదితర పూజలు అర్చకులు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు మజ్జిగను అందజేశారు. అమ్మవారి వెండి చీర నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన తిరుపతి వెంకట కృష్ణకాంత్, శిరీష దంపతులు 5 తులాల వెండి, తిమ్మసర్తి సోమరాజు, సుజాత దంపతులు 5 తులాల వెండిని అందజేసినట్లు రాజాన సత్యనారాయణ తెలిపారు. శ్రీనూకాంబిక ప్రసాద వితరణ భక్త బృందం చక్కెర పొంగలి, పిండి పులిహోర ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం


దాతకు విరాళం బాండ్‌ను అందిస్తున్న ఈవో

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శుక్రవారం రూ.1,00,011 విరాళంగా అందజేశారు. కొవ్వూరుకు చెందిన పెండుర్తి రామకృష్ణ ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్‌ను అందించారు.

జాతీయ లోక్‌అదాలత్ జూలై 5కి మార్పు


జూనియర్ సివిల్ జడ్జి

జంగారెడ్డిగూడెం: జాతీయ లోక్‌అదాలత్ మే 10 వ తేదీన జరగాల్సి ఉండగా దానిని జూలై 5వ తేదీకి మార్పు చేశారని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ తెలియజేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నుంచి అందిన ఉత్తర్వుల మేరకు జాతీయ లోక్‌అదాలత్‌ను మే 10 నుంచి జూలై 5వ తేదీకి మార్పు చేశామన్నారు. ఈ విషయాన్ని గమనించి న్యాయవాదులు, కక్షిదార్లు తమ కేసులను జూలై 5వ తేదీకి రాజీ చేసుకొనుటకు సంసిద్ధం కావాలని ఆయన తెలిపారు.

రామ భక్తుల పాదయాత్ర


ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభించిన భక్తులు

కుక్కునూరు: మండలంలోని వింజరం పంచాయతీ, కొండపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు శుక్రవారం భద్రాచలం రాముల వారి సన్నిధానానికి పాదయాత్రగా వెళ్లారు. ముందుగా కొండపల్లి సెంటర్‌లో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పూజలు చేసిన అనంతరం కాషాయ జెండాలను చేతభూని పాదయాత్ర ప్రారంభించారు. శుక్రవారం అర్ధ రాత్రికి భద్రాచలం చేరుకొని శనివారం ఉదయం గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి రాముల వారి దర్శనం చేసుకోనున్నట్టు భక్తులు తెలిపారు.

మౌలిక సౌకర్యాలు కల్పించండి


నిరసన చేస్తున్న ఏఎస్‌ఆర్ నగర్ వాసులు

టి.నరసాపురం: తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాలని మండలంలోని ఏఎస్‌ఆర్ నగర్ వాసులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంట్రావు ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ 17 ఏళ్లుగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నా నేటి వరకు అధికారులు గాని, ప్రభుత్వాలు గాని ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాలనీలో నివాసం ఉండే వారంతా గిరిజనులు, దళితులని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కార్యక్రమంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

కుక్కునూరు: ఎంతో మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిని ఉన్నత శిఖరాలకు చేర్చిన ఘనత కుక్కునూరు చర్చి స్కూల్‌కు సొంతమని లూథరన్ చర్చి స్కూల్ చైర్మన్ అబ్రహం, ప్రధానోపాధ్యాయులు నక్క శ్రీను పేర్కొన్నారు. శుక్రవారం కుక్కునూరు చర్చి హాస్టల్ ఆవరణలో 1992–2010 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీను, దాసు, మురళి, వాసు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

చింతలపూడి: ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ కిషోర్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవి చంద్ర పర్యవేక్షణలో స్థానిక పోలీసులు మహిళలు, బాలికల భద్రతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ సీహెచ్ రాజశేఖర్, ఎస్సై కుటుంబరావు ఆధ్వర్యంలో మహిళా పోలీసు సిబ్బందితో కలిసి ఆడ పిల్లల రక్షణ–సమాజ పరిరక్షణ అనే నినాదంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ రక్షణ కోసం అందుబాటులో ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు అత్యవసర సేవల నిమిత్తం 112, సైబర్ మోసాలపై ఫిర్యాదుల కోసం 1930, బాలల హెల్ప్‌లైన్ కోసం 1098, మహిళల హెల్ప్‌లైన్ నంబర్ 181, ట్రాఫిక్ సమాచారం కోసం 1073, ఫైర్ ఎమర్జెన్సీ కోసం 101 వంటి కీలకమైన టోల్ ఫ్రీ నంబర్ల ప్రాముఖ్యతను వివరించారు. ఆపద సమయంలో ఈ నంబర్లను ఉపయోగించడం ద్వారా తక్షణ సహాయం పొందొచ్చని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ కుటుంబ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగడం ద్వారా సమాజంలో శాంతి భద్రతలు నెలకొంటాయన్నారు. మహిళల భద్రతకు పోలీసులు అన్ని విధాలా అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు


రైతులకు యంత్ర పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

చింతలపూడి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు యంత్ర పనిముట్లను, పచ్చి రొట్ట విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్కే హబీబ్ పాషా మాట్లాడుతూ నియోజకవర్గంలో 3,152 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ బి.నాగకుమార్, ఏఓ మీనా కుమారి, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న కల్యాణోత్సవాలు


విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు.

ద్వారకాతిరుమల: పురాతన ఆలయమైన లక్ష్మీపురంలోని శ్రీసంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఆలయ ఆవరణలో శ్రీచక్రవార్యోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకను పండితులు, అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని సుగంధభరిత పుష్ప మాలికలు, మామిడితోరణాలతో అలంకరించారు. రాత్రి ఆలయ ధ్వజ స్తంభం వద్ద ధ్వజారోహణను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

ఉగ్రమూకలను సమష్టిగా ఎదుర్కొందాం


జంగారెడ్డిగూడెం: కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


కామవరపుకోట: నిరసన తెలుపుతున్న జామియా మసీద్ కమిటీ సభ్యులు


వేలేరుపాడు: మానవహారం నిర్మించి సంతాపాన్ని తెలుపుతున్న నాయకులు


చింతలపూడి: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జంగారెడ్డిగూడెం: దేశంలో అలజడులు సృష్టించేందుకు ఉగ్రమూకలు చేస్తున్న ప్రయత్నాలను సమష్టిగా ఎదుర్కోవాలని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, పహల్గాం మృతులకు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్టర కార్యదర్శి జెట్టి గురునాథరావు మాట్లాడుతూ కాశ్మీర్ ఘటన తీవ్రంగా కలిచివేసిందన్నారు. కార్యక్రమంలో బూత్‌కమిటీ జోనల్ చైర్మన్ బీవీఆర్ చౌదరి, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, ఏలూరు జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీను, పీపీఎన్ చంద్రరావు, బత్తిన చిన్న, వందనపు వెంకటేశ్వరరావు, కుక్కల ధర్మరాజు, మండల కమిటీ అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, చిప్పాడ వెంకట, రాఘవరాజు ఆదివిష్ణు, గెద్దాడ శ్రీను, చలమాల శ్రీను, కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు పెద్దెత్తున్న పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

కామవరపుకోట: జమ్ము కాశ్మీర్‌లో పెహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాద దాడి అమానుషమని ఈ ఘటనను కొత్తూరు జామియా మసీద్ కమిటీ సభ్యులు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు లాల్ జాన్ బాషా, ఇబ్రహీం, బాబ్ జాన్, నూర్ ఖాన్, యూసుఫ్ అలీ, అన్వార్, ఆమద్, చాన్ బాషా పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

చింతలపూడి: జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడులను ఖండిస్తూ చనిపోయిన వారి స్మారకార్థం నివాళులర్పిస్తూ శుక్రవారం బోసుబొమ్మ సెంటర్ వద్ద సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు ఎన్డీయే ప్రభుత్వం అండగా ఉండి న్యాయం చేయాలని కోరారు.

మృతులకు ఘన నివాళి

వేలేరుపాడు: జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన 28 మంది అమాయక పర్యాటకులకు కూటమి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేశుల ఆదినారాయణ మాట్లాడుతూ ఉగ్రదాడి అత్యంత హేయనీయమన్నారు. అనంతరం మానవహారం నిర్వహించి చనిపోయిన వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ట్రాఫిక్ ఎస్సైగా రాంబాబు



జంగారెడ్డిగూడెం: ట్రాఫిక్ ఎస్సైగా ఆర్.రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ గంగవరం ఎస్సైగా పని చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఏలూరు జిల్లాకు వచ్చి, జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏఎస్సైగా రాంబాబు ద్వారకాతిరుమల, పాలకొల్లు, ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్లలో పని చేశారు.

దాడి కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తిపై దాడి చేసి కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడేనికి చెందిన దమ్మిశెల్లి రవి ట్రాక్టర్ డ్రైవర్‌గా, కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. ఈ నెల 24వ తేదీ రాత్రి స్థానిక శ్రీనివాసపురం బ్రాందీ షాపు వద్ద మద్యం సేవిస్తున్న సమయంలో తగరం కార్తీక్ అనే వ్యక్తి పక్కవారితో గొడవ పడుతున్నాడు. దీంతో కార్తీక్‌ను రవి మందలించాడు. కార్తీక్ మరలా వచ్చి చేతిలో బీరుబాటిల్‌తో రవిపై దాడి చేశాడు. ఈ ఘటనలో రవి తలపై, చేతిపై, చెవిపై గాయాలయ్యాయి. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, రవి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆరోగ్య సేవలను సమగ్రంగా నమోదు చేయాలి

బుట్టాయగూడెం: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా క్షేత్ర స్థాయిలో అందిస్తున్న అన్ని ఆరోగ్య సేవల వివరాలను హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో నమోదు చేయాలని డాక్టర్ కె.మురళీధర్ తెలిపారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద నిర్వహిస్తున్న ఎనామోల్ పోర్టల్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా సవరించిన రిపోర్టింగ్ ఫార్మెట్స్, ఆర్‌సీహెచ్, ఎనామోల్ పోర్టల్స్‌పై బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాలతో పాటు ప్రస్తుతం బైనగూడెం, కొయ్యలగూడెం పీహెచ్‌సీల వైద్యులు సీహెచ్‌ఓ, ఎంపీహెచ్ఈ, ఓఎల్‌టీ, తదితర సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ

జంగారెడ్డిగూడెం: ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఏలూరు, ఏలూరు రూరల్ పరిధిలోకి వచ్చే 23, 24, 25 మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియకు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు మే 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించబడతాయన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు రుసుం రూ.2,00,000 చెల్లించి దరఖాస్తూ చేసుకోవచ్చని శ్రీనుబాబు తెలిపారు.

దోమల నియంత్రణతో మలేరియా నిర్మూలన


చింతలపూడి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


కొయ్యలగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

చింతలపూడి: పరిసరాల పరిశుభ్రతతో దోమల నియంత్రణతో పాటు మలేరియాను సమూలంగా నిర్మూలించొచ్చని డాక్టర్ గీత పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఎస్‌యూఓ ప్రసాద్, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం

కొయ్యలగూడెం: నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ తస్లీమా ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తస్లీమా మాట్లాడుతూ దోమ కుట్టడం వల్ల మలేరియా జ్వరం వస్తుందని, దీనిని అరికట్టడానికి ప్రభుత్వ పరంగా ప్రతి శుక్రవారం డ్రైడే–ఫ్రైడే నిర్వహించాలన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా బయ్యనగూడెం పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎం.గీతారాణి, ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, చింత జానకిరామరాజు, తదితరులు పాల్గొన్నారు


బుట్టాయగూడెం: ర్యాలీని ప్రారంభిస్తున్న పీఓ

మలేరియా నివారణకు ప్రత్యేక కృషి

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియాశాఖ అధికారులు, బుట్టాయగూడెంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన పీవో మాట్లాడారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సురేష్, వసుంధర, వైద్యాధికారులు ప్రియదర్శిని, సబ్ యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు, ఎంపీహెచ్ఈఓలు పి.శ్రీనివాసరావు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ అనుమతులు సులభతరం

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ×స్వీయ ధృవీకరణ పథకం–2025 ద్వారా భవన నిర్మాణ అనుమతులు సులభతరంగా పొందేందుకు అవకాశం కల్పించిందని, కావున గృహ నిర్మాణం చేపట్టాలనుకునే యజమానులు సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా అనుమతులు పొందొచ్చని మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ తెలిపారు. దీనిలో భాగంగా లైసెన్స్ టెక్నికల్ పర్సన్ లేదా సర్వేయర్ లేదా ఇంజనీర్ల ద్వారా గ్రామకంఠం, అధికార లే అవుట్, సర్క్యులేషన్ ప్యాటరన్స్ ఆమోదం పొందిన ప్రాంతాల్లో నివాసం కోసం భవన నిర్మాణ అనుమతులు ఈ పథకం ద్వారా వేగంగా అత్యంత పారదర్శకంగా పొందొచ్చని తెలిపారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

ద్వారకాతిరుమల: పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిపై దాడి చేసిన నలుగురిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం ఐఎస్ రాఘవాపురం పంచాయతీ రామానుజాపురానికి చెందిన తొర్రా సత్యనారాయణకు, అదే గ్రామానికి చెందిన వీరమళ్ల నాని, రాజులపాటి నరసింహమూర్తి,వీరమళ్ల వెంకటేశ్వరరావు, వీరమళ్ల స్వామిలకు పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 21న సత్యనారాయణపై ఈ నలుగురు దాడి చేశారు. ఈ దాడిలో బాధితుడికి తీవ్ర గాయాలు పాలుకాగా, జంగారెడ్డిగూ డెం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.